క్లుప్తంగా

రేపు ఉచిత వైద్యశిబిరం

మిర్యాలగూడ అర్బన్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని వర్షిత ఆస్పత్రిలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మిర్యాలగూడ లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కర్నాటి రమేష్, లింగయ్య, వర్షిత ఆస్పత్రి చైర్మన్ కూటాల రాంబాబులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అత్యంత ఖర్చుతో కూడిన కేన్సర్, కిడ్నీ, గుండె సంబంధిత రోగ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేములపల్లి : అక్రమంగా ఇసుక రవాణాకు పాల్పడుతున్న రెండు ట్రాక్టర్లను పట్టుకోని కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నరసింహారావు బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడ మండలం కాల్వపల్లికి చెందిన ధీరావత్ ధర్మ, దుండిగల వీరస్వామిలు తమ ట్రాక్టర్ల ద్వారా రావులపెంట గ్రామ శివారులోని మూసీ వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా గ్రామ శివారులో పట్టుకున్నామన్నారు. ఈ మేరకు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి యజమానులతోపాటు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేశామన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

అడవిదేవులపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఓటర్లుగా నమోదైన వారు మరల నూతనంగా నమోదు చేసుకోవాలని, దానికి ఫారం –18 ద్వారా చేసుకోవాలని సూచించారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 85 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీ ఫిబ్రవరి 6 వరకు ఉన్నందున పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కనకదుర్గ ఆలయంలో స్వచ్ఛత కార్యక్రమం

వేములపల్లి : మండల కేంద్రంలోని మల్లిఖార్జున, కనకదుర్గ దేవాలయంలో బుధవారం బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ భరత్ ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన 'మందిర్ క్షేత్ర విశేష స్వచ్ఛతా అభియాన్' కార్యక్రమంలో భాగంగా పలు దేవాలయాల్లో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22న అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా దేశంలో మరో దీపావళి పండుగను చూడబోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు చిర్ర సాంబమూర్తి, జిల్లా కిసాన్‌మోర్చ అధ్యక్షుడు సీతారాంరెడ్డి, వెంకన్న, శ్రీరామోజు రవి, భాగ్యమ్మ, నవీన్, ప్రసాద్, నరేష్, ప్రభాకర్, సైదులు, కార్తీక్, మణికంఠ, చరణ్ పాల్గొన్నారు.

పెరిగిన వాహనాల రద్దీ

మాడుగులపల్లి : అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై బుధవారం వాహనాల రద్దీ పెరిగింది. సంక్రాంతి సెలవులు ముగియడంతో పండుగకు సొంతూళ్లకు వెళ్లిన వారు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం కావడంతో రహదారిపై ట్రాఫిక్ నెలకొంది. మాడుగులపల్లి టోల్‌ప్లాజాలోని నార్కట్‌పల్లి రహదారి వైపు ఉన్న 3టోల్‌బూత్‌లకు ఫాస్టాగ్ సిస్టమ్ ఉండడంతో సెకన్ల వ్యవధిలోనే వాహనాలు టోల్ గేట్‌ను దాటుతున్నాయి. సాధారణ రోజుతో పోలిస్తే బుధవారం గంటకు వెయ్యికిపైగా వాహనాలు హైదరాబాద్ వైపు ప్రయాణం చేసినట్లు టోల్‌ప్లాజా అధికారులు పేర్కొంటున్నారు.

లక్ష్మమ్మకు నివాళి

చందంపేట : బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ముత్యాల సర్వయ్య తల్లి లక్ష్మమ్మ దశదిన కర్మను బుధవారం మండలం కేంద్రంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ హాజరై లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యకర్మంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ తదితర మండల నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.భీమార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్ట్ పీజీలో జనరల్, ఓబీసీ అభ్యర్థులకు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉండాలని ఆయన తెలిపారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ కలిగిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 18 నుంచి 20 లోపు తమ దరఖాస్తులను కళాశాలలో సమర్పించాలని ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

మర్రిగూడ : మండలంలోని ఖుదాబాక్ష్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం దివ్యాంగులకు ఉచిత బస్‌పాస్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు ముద్దం నర్సింహాగౌడ్ మాట్లాడుతూ.. మండలంలోని దివ్యాంగులంతా ప్రభుత్వం అందించే ఉచిత బస్‌పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నడ్డి విఠల్‌రెడ్డి, నర్సింగ్ యాదయ్యగౌడ్, ఆంజనేయులు, శ్రీనివాస్‌యాదవ్, జంగయ్య, శ్రీను, యాదయ్య, పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో సర్కారు ఆఫీసులు

- సరైన వసతులు లేక ఇబ్బందులు
- సొంత భవనాలు నిర్మించాలని కోరుతున్న అధికారులు, ప్రజలు




అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు

అడవిదేవులపల్లి : ప్రజా అవసరాలు తీర్చే ప్రభుత్వ అధికారులు ఉండే సర్కారు కార్యాలయాలు అడవిదేవులపల్లి మండలంలో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. గత ఏడేళ్ల నుంచి సొంత భవనాలు లేక ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ఒంటికి, రెంటికి వెళ్లాల్సి వస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలామంది ప్రజలు తమ పనుల కోసం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. అధికారులతో పాటు ప్రజలు కూడా సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కలగని మోక్షం

రాష్ట్ర ప్రభుత్వం అడవిదేవులపల్లి గ్రామాన్ని 2016 అక్టోబర్ 10న మండల కేంద్రంగా మార్చుతూ నూతన మండలాన్ని ఏర్పాటు చేసింది. నేటి వరకు మండలంలో ఏ ఒక్క కార్యాలయానికి కూడా సొంత భవనం లేదు. ప్రభుత్వ కార్యాలయాలన్ని అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలో ప్రధానంగా మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్, పోలీస్ స్టేషన్, స్త్రీ శక్తి భవనాలతో పాటు తదితర కార్యాలయాలన్నీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అరకొర వసతులతో కొనసాగుతుంది. హాస్టల్‌తో పాటు తరగతి గదులు కూడా అవే కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలో కేజీబీవీ కోసం ప్రభుత్వం స్థలం కూడా సేకరించింది. రూ.2.70కోట్ల నిధులు విడుదల చేసినప్పటికీ కేవలం భవన నిర్మాణం 90శాతం మాత్రమే పూర్తి చేశారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సొంత భవనాలను నిర్మించాలి



మండల కేంద్రంగా ఏర్పాటు చేసిన తరువాత అన్ని మండల స్థాయి శాఖలను ఏర్పాటు చేశారు. కానీ ప్రస్తుతం ఆ కార్యాలయాలు అన్ని అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఆ భవనాల్లో సరైన వసతులు లేక ప్రజలు, అధికారులు తీవ్ర ఇబ్బందుల పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి సొంత భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– పెద్దింటి ఏడుకొండలు, బీజేపీ నాయకులు

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



దేవరకొండ : చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

దేవరకొండ : పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. కల్యాణ లక్ష్మి పథకం కింద మంజూరైన చెక్కులను బుధవారం క్యాంప్ కార్యాలయంలో ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీరాములు, తహసీల్దార్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

డిండి : ప్రజాసంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 12మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అందజేసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండే రాష్ట్రంలో ప్రజాపాలన ప్రారంభమైందన్నారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులతో పాటు తులం బంగారం కూడా అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, తహసీల్దార్ ఎస్.తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, రాష్ట్ర కన్వీనర్ లక్పతినాయక్, బద్దెల శ్రీనువాసులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సర్పంచ్‌ల కృషి మరువలేనిది



మాట్లాడుతున్న ఎంపీపీ భగవాన్ నాయక్

తిరుమలగిరి(నాగార్జునసాగర్): గ్రామపంచాయతీల అభివృద్ధికి సర్పంచ్‌లు చేసిన కృషి మరువలేనిదని ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం గ్రామాల్లో, తండాల్లో ఆడపిల్ల అమ్మకాలు జరుగుతున్నాయని అది చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లలను సాకలేకపో యే తల్లిదండ్రులు సంబంధిత అధికారులకు సమాచారం ఇస్తే శిశుగృహకు తరలిస్తామన్నారు. ఆడపిల్లల అమ్మకాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్క అధికారి, ప్రజాప్రతినిధిపై ఉందని గ్రామస్థాయిలో సర్పంచ్, మండల స్థాయిలో ఎంపీపీ చైర్మన్‌గా ఉంటారని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల సమగ్రాభివృద్ధికి పాటుపడాలని ఆయన కోరారు. సర్పంచ్‌లకు చివరి సమావేశం కావడంతో ఎంపీపీ, అధికారులు సర్పంచ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఖాజా అస్గర్‌ఆలీ, హాలియా మార్కెట్ చైర్మన్ వెంకటేశ్వర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

మిర్యాలగూడ : తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన దుండగులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ నాయకులు కోల సైదులు, మహేష్‌గౌడ్, దాసరాజు జయరాజులు అన్నారు. బుధవారం పట్టణంలోని అమర వీరుల స్థూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించి వారు మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు దశదిశ చూపిన తెలంగాణ మేధావి జయశంకర్ విగ్రహాన్ని కూల్చడం దురదృష్టకరమన్నారు. తెలంగాణ ఏర్పాటులో జయశంకర్ పాత్ర ఎనలేనిదన్నారు. ఇప్పటికైన జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన వారిని కఠినంగా శిక్షించి తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సుధాకర్, వెంకటేశ్వర్లు, ఈశ్వరాచారి, ఏడుకొండలు, బంజారా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు దశరథనాయక్, మోసిన్‌అలీ, కవిత పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : హైదరాబాద్‌లోని శేర్‌లింగంపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని కూల్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద జయశంకర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ నాయకులు కోల సైదులు, మహేష్‌గౌడ్ మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటుకు దశ దిశ చూపిన తెలంగాణ మేధావి జయశంకర్ విగ్రహం కూల్చడం దారుణమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సుధాకర్ వెంకటేశ్వర్లు, ఈశ్వరాచారి, కవిత పాల్గొన్నారు.

జాతీయ సహాయ కార్యదర్శిగా దేవ్‌సింగ్ నాయక్ రాథోడ్

హాలియా : ఇంటర్నేషనల్ గ్వార్ బంజారా ప్రగతి ఫౌండేషన్ (ఐజీబీపీఎఫ్) జాతీయ సహాయ కార్యదర్శిగా అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామానికి చెందిన కె. దేవ్‌సింగ్ నాయక్ రాథోడ్ నియమితులైయ్యారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ గ్వార్ బంజారా ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ ఆర్.కె. రాథోర్ న్యూఢిల్లీలో బుధవారం ఆయ నియామకపత్రం అందుకున్నట్లు దేవ్‌సింగ్ నాయక్ రాథోడ్ తెలిపారు.



నియామకం పత్రం అందుకుంటున్న దేవ్‌సింగ్ నాయక్ రాథోడ్

అలరించిన అన్నమయ్య కీర్తనలు

నకిరేకల్: అన్నమయ్య కళాసమితి నకిరేకల్ అధ్యక్షురాలు సుమలత ఆధ్వర్యంలో పట్టణంలోని ఐశ్వర్య సాయి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన అన్నమయ్య పదసుమార్చనం కార్యక్రమం ప్రేక్షకులను అలరించింది. హైదరాబాద్, మెదక్, కరీంనగర్, నల్లగొండ ఉమ్మడి జిల్లాల నుంచి విచ్చేసిన నాలుగేళ్ల నుంచి 14 ఏళ్ల లోపు చిన్నారులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా కీర్తనలు ఆలపించిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాధవి వెల్లంకి వాఖ్యాతగా వ్యహరించారు. సినీ సంగీత దర్శకులు సాలూరి వాసురావు, స్వర వీణాపాణి, రవివర్మ పోతేదార్‌తో పాటు జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ ఎం. పురుషోత్తమాచార్యులు, కవయిత్రిలు రోజాదేవి, నివారిణ పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలతో చిన్నారులు

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరేష్

హాలియా : హాలియాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో మహిళా లెక్చరర్‌ను వేదింపులకు గురిచేస్తున్న ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యాబుద్ధులు నెర్పాల్సిన ఆ ప్రిన్సిపాల్ అదే కళాశాలలో పనిచేస్తున్న మహిళా లైక్చరర్‌ను లైంగిక వేదింపులకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని ఆ మహిళా లెక్చరర్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టడంతో పాటు ఇంటర్ బోర్డు కార్యదర్శికి కూడా పిర్యాదు చేసిందన్నారు. విచారణ పేరుతో హాలియా ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇంటర్ బోర్డు అధికారులు వచ్చి రెండు నెలల గడుస్తున్న నేటికి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోకపోవడం వెనుక ఆంతర్యమేమిటని వారు ప్రశ్నించారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ప్రిన్స్‌పాల్‌పై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీష్, చందు, ప్రవీణ్, అశోక్ తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ



త్రిపురారం : అల్వాలపాడులో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు



వేములపల్లి : లక్ష్మీదేవిగూడెంలో అక్షింతలను పంపిణీ చేస్తున్న స్వాములు



పెద్దవూర : చింతపల్లిలో రాముడు, సీత, లక్ష్మణుడి వేషధారణలో భక్తులు

త్రిపురారం : అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని అల్వాలపాడు గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తులు గ్రామంలో వీధుల్లో నృత్యాలతో రామ నామం జపిస్తూ ప్రతి ఇంటికీ అయోధ్య అక్షింతలు పంపిణీ చేశారు. ఈ నెల 22న ప్రతి ఇంటిలో దీపాలు వెలిగించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చెవుల రామయ్య, గుడిపాటి రవికుమార్, సైదా, గంగయ్య గ్రామస్తులు అధితరులు పాల్గొన్నారు.

వేములపల్లి : అయోధ్య రాముడి అక్షింతలను బుధవారం మండలంలోని లక్ష్మీదేవిగూడెంకు చేరుకోగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి మాలధారణ స్వాములు, భక్తులు గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో సూర్యకుమార్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అక్షింతలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఇంటింటికీ అక్షింతలను, అయోధ్య రామమందిర ఫొటో, కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్వాములు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండలంలోని చింతపల్లి గ్రామంలో బుధవారం అయోధ్య రాముల వారి అక్షింతలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, ఆంజనేయ స్వామి అలంకరణలో ప్రత్యేక ఆకర్షణతో ఇంటింటికీ తిరిగారు. గ్రామంలోని దేవాయలంలో అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా వెళ్లి ఇంటింటికి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుంకిరెడ్డి ప్రభావతిసంజీవరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వేముల రోహిత్‌కు నివాళి

నల్లగొండ టౌన్: హైదరాబాద్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో చదువుతూ అక్కడ జరుగుతన్న వివక్షతకు ఎదురొడ్డి నిలిచిన మహోన్నత వ్యక్తి వేముల రోహిత్ అని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, విద్యావంతుల వేదిక రాష్ట్ర నాయకుడు పందుల సైదులు అన్నారు. బుధవారం వేముల రోహిత్ వర్ధంతి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో గల తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాదె నర్సింహ, నవీన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు మసీద్ కమిటీ శుభాకాంక్షలు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న హౌసింగ్‌బోర్డు మసీద్ కమిటీ సభ్యులు

మిర్యాలగూడ : పట్టణంలోని 15వ వార్డు హౌసింగ్‌బోర్డు మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎండి.ఇక్బాల్ షరీఫ్, కౌన్సిలర్ రుణాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని బుధవారం కలిసి నోట్ పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మసీద్ ఇమామ్ ఎండీ. హాఫీజ్ అన్సారి, మౌజన్ సయ్యద్ కరీం, మసీద్ సెక్రటరీ సయ్యద్ మక్బుల్‌పాషా, కోశాధికారి ఎండి.నసీర్, సభ్యులు నజీర్, బాజీబాబా పాల్గొన్నారు.

చెక్కు బౌన్స్ కేసులో ఆరు నెలల జైలు

మిర్యాలగూడ అర్బన్ : చెక్కు బౌన్స్‌కేసులో ఒక వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.3.95లక్షల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ జడ్జి బీఎస్ఎస్ సుమబాల బుధవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. నల్లగొండ జిల్లా పానగల్లు గ్రామానికి చెందిన చింత యల్లయ్య తన అవసరాల నిమిత్తం ఫిబ్రవరి 24, 2018న రూ.3లక్షలు అప్పుగా తీసుకుని అందుకు రూ.3లక్షల చెక్కును తండు నగేశ్ పేరుమీద రాసి ఇచ్చాడు. ఆ చెక్కు గడువు తేదీ బ్యాంకులో వేయగా ఆ ఖాతాలో నగదు లేవని చెక్కు వాపస్‌వచ్చింది. దీంతో కోర్టులో కేసు వేయగా ఇరుపక్షాల వాదనలు విని అనంతరం కోర్టు పై తీర్పును వెలువరించింది.

నీలగిరిని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దుతా

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ఎన్జీ కళాశాల వద్ద రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి, కలెక్టర్, తదితరులు

నల్లగొండ టూటౌన్: ప్రజలకు కావల్సిన అన్ని మౌలిక సదుయాపాయాలు కల్పించి నల్లగొండ(నీలగిరి)ను మున్సిపాలిటీని ఆదర్శంగా పట్టణంగా తీర్చుదిద్దాతానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల నుంచి రామగిరి సెంటర్ వరకు రూ.1.30కోట్లతో, శివాజీనగర్ నుంచి చందమామ అపార్ట్‌మెంట్ వరకు రూ.90 లక్షలతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, పేదలందరికీ ఇందరిమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని తెలిపారు. గ్రామ సభలు పెట్టి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మాదిరిగా కాకుండా ఇందిరమ్మ రాజ్యంలో అందరికీ మేలు జరుగుతుందన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్నివర్గాలకు సంక్షేమం సాధ్యమన్నారు. చిన్న, చిన్న పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ యంత్రాంగమే ప్రజల వద్దకు వస్తుందన్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి మార్పులు, చేర్పులు తదితర వాటిపై జిల్లా కలెక్టర్‌కు హరిచందనకు మంత్రి పలు సూచనలు చేశారు. అదేవిధంగా పండ్ల వ్యాపారుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ కందుకూరి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు కవితాదయాకర్, శ్రీనివాస్, ఖయ్యూంబేగ్ తదితరులు పాల్గొన్నారు.

బసవేశ్వరుడి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలి

పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద మహాత్మా బసవేశ్వరుడి విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ వీరశైవలింగాయత్, లింగబలిజ సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తొలి సంఘ సంస్కర్త అయిన బసవేశ్వరుని విగ్రహానికి ప్రభుత్వపరంగా జిల్లా కోర్టు ఎదుట స్థలం కేటాయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో మాజీ కౌన్సిలర్ నాగరాజు, సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి కోటి, వరప్రసాద్, పరమేశ్, శేఖర్, లింగప్ప, నాగరాజు ఉన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ మైనార్టీ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (టీఎస్ఎంఇఎస్ఎ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం నల్లగొండ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంత్రి వెంకట్‌రెడ్డి ఆవిష్కరించారు.

వెంకట్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై హర్షం

డిండి : ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌కు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంపై ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి పున్న దినేశ్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పదేళ్ల నుంచి విద్యార్థులు, నిరుద్యోగులు ఎదుర్కొన్న సమస్యలపై బల్మూరి వెంకట్ నిరంతరం పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సయ్యద్‌రసీమియా

మఠంపల్లి : ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్‌రసీమియా కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల సర్వీస్‌లను రెగ్యులర్ చేయాలని, మధ్యాహ్న భోజన ఏజెన్సీల బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించాలని, అంగన్‌వాడీ, హమాలీలు, పాఠశాలల స్వీపర్లు తదితర రంగాల వారి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం మండల నాయకులు గుర్రం లింగమ్మ, ఎం.మైసయ్య, కె.గురువారెడ్డి, దేవదానం, లాలాసాహెబ్, శాంతికుమారి, రాము, పద్మ, సాలమ్మ, వీరస్వామి, పాల్గొన్నారు.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు



తలపడుతున్న కబడ్డీ జట్లు

మఠంపల్లి : సంక్రాంతి సందర్భంగా మండలంలోని యాతవాకిళ్లలో ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు బుధవారం మూడవరోజు హోరాహోరీగా కొనసాగాయి. సుమారు 38 జట్లు ఈ పోటీలలో తలపడుతున్నాయి. పోటీలు ముగియగానే విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందజేస్తామని విన్నర్స్ అకాడమీ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంటిపులి శ్రీను, బండి వెంకటరెడ్డి, కీసర వెంకన్న గడ్డం వీరయ్య, సైదయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

హుజూర్‌నగర్ : వార్డులో అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మూడవ వార్డు ఎన్జీఓ కాలనీలో జరుగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కామిశెట్టినగర్, చైతన్య కాలనీ, ఎన్జీవోస్ కాలనీలకు సీసీ రోడ్లు, డ్రెయినేజీలు మంజూరు అయ్యాయని, త్వరలో నిర్మాణ పనులు పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. అంతేకాకుండా ఎన్జీవో కాలనీ మెయిన్ రోడ్డు, ఏవీఎస్ అపార్ట్‌మెంట్ రోడ్ల కోసం ప్రతిపాదనలు పంపినట్లు ఆయన తెలిపారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థికసాయం

నల్లగొండ : నిరుపేద విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.50వేల ఆర్థిక సాయం అందజేశారు. రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన కర్నాటి శ్రీవిద్య చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి స్పందించి బుధవారం నల్లగొండ పట్టణంలో శ్రీవిద్యకు రూ.50వేలు అందించడమే కాకుండా ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా ఆమె చదువు పూర్తయ్యే వరకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.